క్లుప్తంగా...

రోడ్డు విస్తరణ అధికారిగా రాకేష్

మణికొండ: మణికొండ మున్సిపాలిటీలో పెండింగ్‌లో పడిన రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించారు. మణికొండ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న జి.రాకేష్‌ను హెచ్ఎండీఏఎల్ పరిధిలోకి మార్చి రోడ్ల విస్తరణ పనులను అప్పగించారు. టౌన్‌ప్లానింగ్ బాధ్యతలను మున్సిపల్ మేనేజర్ బీఎన్‌కే రమేష్‌కు అప్పగిస్తూ మున్సిపల్ కమిషనర్ కె. ఫల్గుణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్, డైరెక్టర్ టౌన్ ప్లానింగ్ హైదరాబాద్, సీడీఎంఏ, టీఎస్‌బీపాస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

15 నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 29 వరకు దేవీ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పదవీ విరమణ సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఆచార్యులు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీలో ప్రొ.వీసీ ఆర్ఎస్ సర్రాజు పదవీవిరమణ అభినందన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సుమారు మూడున్నర దశాబ్దాల పాటు హెచ్‌సీయూలో అధ్యాపకుడిగానే కాకుండా వివిధ బాధ్యతలను నిర్వహించారు. మానవీయశాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో డీన్ ఆచార్య కృష్ణ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య కృష్ణ మాట్లాడుతూ పదవీ విరమణ ప్రతి ఒక్కరికీ సహజమని, వారి సేవలు గుర్తుండిపోతాయన్నారు. ఆచార్యులు గజేంద్రపాఠక్, మురళీ మనోహర్, దార్ల వెంకటేశ్వరరావు, ఫజలుల్లా, పిల్లలమర్రి రాములు, పమ్మి పవన్‌కుమార్, భీమయ్య, హైమావతి, భుజంగరెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మంత్రి కిషన్ రెడ్డిని కలిసిన బీజేపీ నాయకులు

అబిడ్స్: కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిని గోషామహల్ నియోజకవర్గం బీజేపీ సీనియర్ నాయకులు కలిశారు. గోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునందన్ యాదవ్ తన బయోడేటాను కిషన్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్ యాదవ్ మాట్లాడుతూ.... 43 ఏళ్లుగా బీజేపీలో ఒక క్రమశిక్షణ గల కార్యకర్తగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్న తనకు టికెట్టు కేటాయిస్తే భారీ మెజార్టీతో విజయం సాధిస్తానన్నారు.

యువకుడి అదృశ్యం



దినేష్ కుమార్ (ఫైల్)

మైలార్‌దేవ్‌పల్లి: ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ రాములు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్, సాయిబాబ నగర్‌లో నివాసం ఉంటున్న దినేష్ కుమార్ తన స్నేహితుడు గులాంసింగ్‌తో కలిసి శనివారం మద్యం సేవించారు. అప్పటి నుంచి అతను ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగ నైపుణ్యాలు పెంచుకోవాలి

చార్మినార్: కేవలం డిగ్రీ పట్టాతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందలేమని... తగిన ఉద్యోగ సంసిద్ధ నైపుణ్యాలను పెంపుదల చేసుకున్నప్పుడే మంచి ఉద్యోగాన్ని సంపాదించగలుగుతారని యునైటెడ్ వే హైదరాబాద్ చాప్టర్ మేనేజర్ సుమన బొమ్ము అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల తెలంగాణ జ్ఞాన నైపుణ్యాల కేంద్రంతో కలిసి డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులకు జాబ్ రెడీనెస్ కార్యక్రమం ప్రారంభ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ ఎన్జీవో ద్వారా దేశ వ్యాప్తంగా ప్రముఖ నగరాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని... హైదరాబాద్ విభాగం నుండి నగరంలోని ప్రముఖ కళాశాలల విద్యార్థులకు వివిధ నైపుణ్యాలను అందిస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులంతా దశల వారిగా వారందించే శిక్షణ తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఝాన్సీ, డాక్టర్ జె.నీరజా, డాక్టర్ దయానంద్, అవంతి, సంతోష్, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.



డేంజర్ డ్రెయిన్

- దుర్గానగర్ చౌరస్తాలో ప్రమాదకరంగా బాక్స్ డ్రెయిన్
- బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రజలు

మైలార్‌దేవ్‌పల్లి: బాక్స్ డ్రెయిన్ మ్యాన్‌హోల్‌లో మనుషులే కాకుండా మూగ జీవాలు కూడా ప్రమాదాల భారినపడి మరణాలు సంభవిస్తున్నాయి. ప్రమాదకరంగా చౌరస్తాలోనే కాకుండా కాలనీలో కూడా భారీ మ్యాన్‌హోల్‌కు పై కప్పు వేయకుండా నెలలు గడుస్తున్నా కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. స్థానికులు అనేకసార్లు కాంట్రాక్టర్‌కు అడిగినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్ డ్రైనేజీ పనులు చేస్తూ.. మధ్యలో పనులు వదిలేయడంతో ప్రమాదకంగా మారుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. దుర్గానగర్‌లో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ బాక్స్ డ్రైనేజీ ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారిపై డ్రైనేజీ మ్యాన్‌హోల్‌కు ఎలాంటి ప్రమాద సూచికలు లేకుండా వదిలేయడాన్ని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఎవరైనా ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరని స్థానికులు మండిపడుతున్నారు.



అర్ధంతరంగా వదిలేసిన బాక్స్ డ్రైన్ గుంత

> **బారికేడ్లను ఏర్పాటు చేయాలి..**
>
> 
>
> ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్ గుంతల వద్ద నెలలు గడుస్తున్నా ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదు. ఇంటికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. మ్యాన్ హోల్ కట్టడానికి పెద్ద గొయ్యి తవ్వి వదిలేశారు. పనులు అయ్యే వరకు గుంత చుట్టూ బారికేడ్లను ఏర్పాటు చేయాలి.
>
> – నర్సింహగౌడ్, స్థానికుడు

◆ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ చౌరస్తా నుంచి దుర్గాకన్వెన్షన్ వరకు సుమారు రూ.13 కోట్లతో 6 మీటర్ల వెడల్పు 350 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న బాక్స్‌డ్రెయిన్ పనులు మొదట్లో వేగవంతంగా జరగగా.. 90 శాతం మేర పనులను పూర్తి చేశారు. రోడ్లపై ఇష్టానుసారంగా వ్యర్థాలు, చౌరస్తాలో పెద్ద గొయ్యి తవ్వి వదిలేశారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు రోడ్లపై నీరు ప్రమాదకరంగా నిలుస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఫౌండర్ కన్నుమూత



టి.శ్యామల్‌రావు

మణికొండ: మణికొండ, పుప్పాలగూడ గ్రామ పంచాయతీల పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యుడు, సౌత్ ఇండియా మూవీ స్టిల్ కెమెరామెన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, చిత్రపురి హౌసింగ్ సొసైటీ సభ్యుడు టి. శ్యామల్‌రావు (80) బుధవారం కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మణికొండ హరివిల్లు అపార్ట్‌మెంట్స్‌లోని తన స్వగృహంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయన మణికొండ, పుప్పాలగూడ పంచాయతీల పరిధిలోని కాలనీల అభివృద్ధికి విశేష కృషి చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ప్లెజెంట్ వ్యాలీ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం పనిచేశారు. సినీ పరిశ్రమ చెన్నై నుంచి హైదరాబాద్‌కు తరలివచ్చేందుకు అప్పట్లో తన వంతు కృషి చేశారు. ఆయన మృతి పట్ల ప్లెజెంట్ వ్యాలీ కాలనీ, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ నాయకులు, సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం నారాయణగూడలోని స్మశానవాటికలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు బాబ్జి తెలిపారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన సాయిబాబా



కేటీఆర్‌ను కలిసిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా

రాయదుర్గం: ఐటీ శాఖామంత్రి, బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీరామారావును గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డితో కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లిలో పార్టీ పరిస్థితి ఎన్నికల్లో సమష్టిగా కృషి చేయాలని సాయిబాబాకు మంత్రి సూచించారని పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, పార్టీ పరిస్థితిని మంత్రి అడిగినట్లు తెలిపారు.

కృష్ణమాదిగ పాదయాత్రకు మద్దతు



మంద కృష్ణమాదిగ పాదయాత్రకు మద్దతు తెలిపిన గండిపేట నాయకులు

మణికొండ: మాదిగల ఏబీసీడీ వర్గీకరణ సాధనకు ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చేపట్టిన విశ్వరూప మహాపాదయాత్రకు గండిపేట మండల నాయకులు బుధవారం మద్దతు తెలిపారు. వనపర్తి జిల్లా, పెబ్బేరులో కొనసాగుతున్న ఆయన పాదయాత్రలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు పి. గణేష్‌మాదిగ మాట్లాడుతూ మాదిగల అభ్యున్నతికి మందకృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమం అభినందనీయమన్నారు. ఆయన ఆధ్వర్యంలో వర్గీకరణ సాధించి తీరుతామన్నారు. మద్దతు తెలిపిన వారిలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు కె.రవికాంత్‌మాదిగ, బీజేపీ మణికొండ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి వేణుకుమార్, ఓబీసీ ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, నాయకులు ఎ. నగేష్ మాదిగ, జగన్ మాదిగ తదితరులు ఉన్నారు.

'మనూ'లో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో స్పాట్ అడ్మిషన్లు

రాయదుర్గం: మనూలో బీఈడీ, పాలిటెక్నిక్ కోర్సులలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తునట్లు 'మనూ' అడ్మిషన్స్ డైరెక్టరేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ వనజ తెలిపారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కేంద్రాలైన ఔరంగాబాద్, బీదర్, భోపాల్, నూహ్, సంభాల్, శ్రీనగర్‌లలో, పాలిటెక్నిక్ కేంద్రాలైన బెంగళూరు, కడప, కటక్‌లలో అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మనూ 2023–24లో హాజరైన, అర్హత సాధించిన అభ్యర్థులు, ఇంతకుముందు నోటిఫై చేయబడిన తాత్కాలిక జాబితాలలో పేరు కనిపించని అభ్యర్థులు ఈ సదుపాయాన్ని పొందవచ్చని ఆమె వివరించారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు అక్టోబర్ 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత క్యాంపస్‌లలో వ్యక్తిగతంగా రిపోర్ట్ చేయవచ్చని పేర్కొన్నారు. ఆఫ్‌లైన్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ అక్టోబర్ 16న జరుగుతుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు 19,20 తేదీలలో ఫీజు చెల్లించ వచ్చన్నారు. మరిన్ని వివరాలకు యూనివర్శిటీ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

విద్యార్థినిని కొట్టిన హెచ్‌ఎంపై కేసు నమోదు

గౌలిపురా: పాఠశాలకు రాలేదన్న కారణంతో విద్యార్థినిని విక్షణారహితంగా కొట్టిన ప్రధానోపాధ్యాయురాలిపై బుధవారం మొఘల్‌పురా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... లాల్‌దర్వాజా వెంకట్‌రావు స్కూల్‌లో స్థానికంగా ఉండే బిందు కూతురు వైష్ణవి (12) ఐదో తరగతి విద్యనభ్యసిస్తుంది. జూలైలో బాలిక తండ్రి ఈశ్వర్ మృతి చెందడంతో తీవ్ర మనస్థాపంలో ఉన్న బాలిక అప్పటి నుంచి పాఠశాలకు సరిగ్గా వెళ్లడం లేదు. ఇందులో భాగంగా ఈ నెల 4వ తేదీన తల్లి, బంధువులు సముదాయించడంతో పాఠశాలకు వెళ్లింది. మధ్యాహ్నం భోజనం చేస్తున్న సమయంలో ప్రధానోపాధ్యాయురాలు వైష్ణవిని తన కార్యాలయంలోకి తీసుకెళ్లి విపరీతంగా కొట్టింది. విక్షణారహితంగా కొట్టడంతో వాతలు వచ్చాయి. ఇంటికి వచ్చిన వైష్ణవి బాధపడుతుండటంతో తల్లి గమనించింది. అనంతరం వైష్ణవిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై తల్లి ఫిర్యాదు మేరకు మొఘల్‌పురా పోలీసులు బుధవారం ప్రధానోపాధ్యాయురాలిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివాంటీస్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు వీరే..



రాయదుర్గం: గోపన్‌పల్లి శివారులోని వివాంటీస్ అపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివాంటీస్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్–2023లో అండర్–11, అండర్–13, అండర్–15, విమెన్స్ సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్, మెన్ డబుల్స్ పోటీలను నిర్వహించారు. అండర్–11 విభాగంలో మొదటి స్థానంలో దర్శిల్, రెండవ స్థానంలో కె.ఆర్నవ్, మూడవ స్థానంలో అథరవ్ వేదుల నిలిచారు. అదేవిధంగా అండర్–13లో నవికాఅగర్వాల్, సమంత్, మోక్షజ్ఞ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్–15లో సుజయ్ గడ్డం, రామ్‌ప్రహన్, విక్రాంత్ బాల, విమెన్స్ సింగిల్స్ విభాగంలో ప్రియాంక, అలేఖ్య, త్రిషాసిన్హా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అదేవిధంగా మిక్స్‌డ్ డబుల్స్ విజేతలలో మనోహర్ గడ్డం–త్రిషా సిన్హా, సుబ్బు–అలేఖ్య, రుషిదేష్‌పాండే–ప్రియ, మెన్స్ డబుల్స్ విజేతలుగా మనోహర్‌గడ్డం–సౌరబ్‌జౌన్, రుషిదేష్‌పాండే–పియూష్, రామ్‌శంకర్–డేవిడ్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. విజేతలుగా నిలిచిన వారికి అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ట్రోఫీలను బహుకరించి అభినందించారు.

టీఎన్జీఓస్ యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం

అబిడ్స్: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు, అసద్‌అన్వర్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి వద్ద దాదాపు 600 మందికి పరిపుష్టమైన అల్పాహారాలు అందించారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఎంఏ ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జైలు శిక్ష, జరిమానా

సంతోష్‌నగర్: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని బుధవారం కోర్టులో హాజరు పరచగా జైలు శిక్ష, జరిమానాలు విధించినట్లు నగర ట్రాఫిక్ డీసీపీ–3 డి.శ్రీనివాస్ తెలిపారు. సౌత్ ఈస్ట్ జోన్, సౌత్ వెస్ట్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 160 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. వీరందరిని బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 25 మందికి జైలు శిక్ష విధించారన్నారు. ముగ్గురు వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్‌లను సస్పెండ్ చేశారన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల హామీలను ప్రజలు నమ్మరు

జంగ్ తెలంగాణ 2023

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్



స్థానికులకు కరపత్రాలను అందిస్తున్న రవికుమార్‌యాదవ్

శేరిలింగంపల్లి: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల దొంగ హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా బుధవారం చందానగర్ డివిజన్ శివాజీనగర్ వీకర్‌సెక్షన్, టెలిఫోన్ కాలనీలలో ఆయన ఇంటింటికి తిరుగుతూ బీజేపీ కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ అమలు కాని హామీలను ఇస్తూ ప్రజలను మభ్యపెట్టడానికి ఈ రెండు పార్టీలు ఒకటై వస్తున్నాయన్నారు. శేరిలింగంపల్లిలో ఈసారి కాషాయ జెండాను ఎగురవేస్తామని ఆయన స్పష్టం చేశారు. బీజేపీకి శేరిలింగంపల్లిలో తిరుగులేదన్నారు. కార్యక్రమంలో గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నాయకులు రామ్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్‌రెడ్డి,చ మల్లేష్‌గౌడ్, ప్రభాకర్, కృష్ణదాస్, చందర్‌యాదవ్, గౌస్,రాజు, అశోక్, రవి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో యువత చేరిక



పార్టీలో చేరిన యువకులతో నాయకులు రఘునాథ్ యాదవ్

గచ్చిబౌలి: బీఆర్ఎస్ ప్రభుత్వం యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించకుండా తీవ్ర అన్యాయం చేసిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ పార్టీ కార్యాలయంలో చందానగర్, మియాపూర్ డివిజన్‌కు చెందిన పలువురి యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపులో యువకుల ఓట్లు కీలకం అని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రాములుగౌడ్, మహేందర్, గోపాల్, జీవన్, రాము, జగదీష్, భరత్‌యాదవ్, కుమార్‌సాగర్, చరణ్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు



కార్వాన్‌లో కాంగ్రెస్ నాయకులతో కురాకుల కృష్ణ

గోల్కొండ: అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్పి ఇంటికి పంపుతారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం కార్వాన్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ సమావేశం జరిగింది. కేసీఆర్ ప్రజలను దోచుకున్నారే తప్ప రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఆయన ఆరోపించారు. సంక్షేమ పథకాలంటూ అప్పులు తెచ్చిన డబ్బు బీఆర్ఎస్ నాయకులకు అప్పజెప్పారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంటి బాబు, అమిత్‌ఖాన్, రాములు తదితరులున్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషిచేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ

గోల్కొండ: ఈసారి జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అత్యధిక సీట్లు గెలిచిప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణ అన్నారు. బుధవారం గుడిమల్కాపూర్ లక్ష్మీనగర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ అడ్‌హక్ కమిటి సభ్యులు కె.శేఖర్‌రెడ్డి కార్యాలయంలో బీఆర్ఎస్ సమావేశం జరిగింది. ఓటింగ్ శాతం పెంచడం బీఆర్ఎస్ నాయకుల ప్రథమ కర్తవ్యం అన్నారు. బీఆర్ఎస్ సంక్షేమ పథకాల వల్ల వేలాది కుటుంబాలు లబ్ధిపొందాయని ఆయన అన్నారు. కాంగ్రెస్ కాలం చెల్లి గడువు తీరిన పార్టీ అని ఆ పార్టీకి దేశ ప్రజలందరు తిరస్కరిస్తున్నారని అన్నారు. గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బండారి ప్రకాష్, కె.శేఖర్‌రెడ్డి, తూంకుంట అరుణ్‌కుమార్, కె.వెంకటేష్ తదితరులున్నారు.

మురుగు సమస్య లేకుండా చూడండి



జలమండలి డీజీఎంతో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే

గోల్కొండ: డ్రైనేజీ పూడికలకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన షేక్‌పేట్‌లోని జలమండలి కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైనేజీ పూడిక తీతకు అందుబాటులో ఉన్న యంత్రాలను అడిగి తెలుసుకున్నారు. జలమండలి క్షేత్రస్థాయి సిబ్బంది మరింత సమర్థతతో పని చేయాలని కొత్తగా వచ్చిన వాహనాలను సక్రమంగా వినియోగించుకుంటూ ఎక్కడ కూడా డ్రైనేజీ పొంగకుండా చూడాలన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లీస్ నాయకులు హారూన్‌ఫరాన్, బద్దరుద్దీన్, జలమండలి సిబ్బంది తదితరులున్నారు.

కళలతో ఒత్తిడి మాయం



కళాప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

విజయనగర్‌కాలనీ: దైనందిన జీవితంలోని ఒత్తిడిని తగ్గించి ఆనందానుభూతుల్ని కలిగించే శక్తి కళలకు ఉందని కవి, గాయకుడు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్శిటీ ప్రాంగణంలోని నెహ్రూ ఆర్ట్ గ్యాలరీలో కృష్ణా తృష్ణ కలెక్టివ్ షేడ్స్ పేరిట ఏర్పాటు చేసిన కళా ప్రదర్శనను ఆయన శంకరాభరణం (పాత) సినిమా ఫేమ్ హీరోయిని తులసితో కలిసి బుధవారం ప్రారంభించారు. కళల ద్వారా సమాజాన్ని ఉత్తేజపరిచి చైతన్యవంతం చేయవచ్చన్నారు. ఆకట్టుకునే ఉత్తర్వులు అందమైన కళాఖండాలు ఆలోచింపజేస్తున్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 15 వరకు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తిలకించవచ్చన్నారు. కార్యక్రమంలో కె.సజయ, రమేష్‌బాబు ఓమ్మీ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



సయ్యద్ అఫ్రోజ్ (ఫైల్)

గౌలిపురా: పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నరేందర్ తెలిపిన మేరకు.. తలాబ్‌కట్టా ప్రాంతానికి చెందిన సయ్యద్ అఫ్రోజ్ (26), ఆసిఫా ఫాతిమాలు దంతపలు. సయ్యద్ అఫ్రోజ్ భార్యతో గొడవపడి తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. ఈ నెల 7వ తేదీన మధ్యాహ్నం 12.30 గంటలకు అఫ్రోజ్ పని నిమిత్తం ఇంట్లో నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో తన కుమారుడు కనిపించడం లేదని తండ్రి సయ్యద్ ఫెరోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొండాపూర్ ఆస్పత్రిలో మార్చురీ ఏర్పాటు చేయాలి

రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ కమిషనర్‌కు వినతి

రాయదుర్గం: కొండాపూర్ జిల్లా ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేయాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ కోరారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. రంగారెడ్డిజిల్లాలోని శేరిలింగంపల్లి ప్రాంతం ఐటీ రంగానికి కేంద్రంగా మారడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి చాలా మంది ఇక్కడ నివాసముంటున్నారని పేర్కొన్నారు. వారు ఉద్యోగాల నిమిత్తం విదేశాలలో పనిచేయడానికి వెళ్లగా వారి తల్లిదండ్రులు ఇక్కడే నివాసముంటున్నారని వివరించారు. ఈ క్రమంలో ఎవరైనా మృతి చెందితే వారు వచ్చే వరకు అంత్యక్రియల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని అందు కోసం గాంధీ, ఉస్మానియా, ఇతర ఆస్పత్రుల మార్చురీలో పెట్టాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఆస్పత్రిలో మార్చురీని ఏర్పాటు చేస్తే కూకట్‌పల్లి, రాజేంద్రనగర్, పటాన్‌చెరువాసులకు కూడా ఉపయుక్తంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.